www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 4 జూన్ 2025
5
కాకినాడ

నేటితో వెబ్ ఆప్షన్స్‌కు గడువు పూర్తి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్స్‌గా పని చేస్తున్నటువంటి పాధ్యాయుల బదిలీలకు సంబంధించిన వెబ్ ఆప్షన్స్‌కు బుధవారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగియనుందని కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని ఆయా యాజమాన్యాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎవరైనా వెబ్ ఆప్షన్స్‌ను నమోదు చేసుకోకపోతే అటువంటి వారు బుధవారం సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

పుష్కర నీరందేనా..?

- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- తాళ్లూరు లిఫ్ట్ పైపులైన్‌కు మోక్షం ఎప్పుడో
- ఎంఎల్ఎ జ్యోతుల హామీ అమలయ్యేనా..?
- ప్రశ్నార్థకంగా 35 వేల ఎకరాల ఆయకట్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

మెట్ట ప్రాంత భూములు సస్యశ్యామలం అయ్యాయంటే పుష్కర జలాలే మూలకారణం. గత ఐదేళ్లుగా పుష్కర ఎత్తిపోతల నుంచి పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల కాలేదు. గత వైసిపి ప్రభుత్వం సాగునీటి రంగంపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకంలో భాగంగా తాళ్లూరు వద్ద ఏర్పాటు చేసిన లిఫ్ట్ వద్ద పైపులైన్‌కు మరమ్మతులు చేయించకపోవడంతో సుమారు 35 వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందనే ఆశతో రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాదియైనా పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందుతుందా? లేదా గత ఏడాది మాదిరిగానే పంటను వదులుకోవాలా? అనే అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి.

తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని పురుషోత్తమపట్నం వద్ద లిఫ్ట్ చేసి కాలువ ద్వారా నీరు అందిస్తే మెట్ట ప్రాంత నియోజకవర్గాలకు నీరు అందుతుంది. నియోజకవర్గంలోని గండేపల్లి, జగ్గంపేట, గోకవరం మండలాల పరిధిలోని ఎగువ ప్రాంత భూములను నీరు అందాలి అంటే తాళ్ళూరు వద్ద ఉన్న పంపు హౌస్ నుంచి నీటిని లిఫ్ట్ చేయాలి. అలా లిఫ్ట్ చేసిన తరువాత పంపే పైపులైన్‌కు గత ఐదేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. గత వైసిపి ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా సుమారు 35 వేల ఎకరాల ఆయకట్టు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. 2023 ఖరీఫ్‌కు ముందు పైపులైన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో అధికార యంత్రాంగం పైపులైన్‌కు మరమ్మతులు చేయించింది. ఎంతో ఆర్భాటంగా కలెక్టర్ కృతికా శుక్లా సాగునీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. అయితే పైపులైన్‌కు చేసిన తాత్కాలిక మరమ్మతులు కేవలం 15 రోజులకే చెడిపోయాయి. దీంతో సాగునీటి విడుదలను నిలిపివేశారు. గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తాళ్లూరు లిఫ్ట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ఏడాది సాగునీరు ఇవ్వలేమని..రైతులు ఎవ్వరూ సాగు చేయద్దని, వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి స్టీల్ పైపులైన్లను మార్పించి సాగునీటిని విడుదల చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. తాళ్లూరు లిఫ్ట్‌పై ఆధారపడిన 35 వేల ఎకరాలకు సంబంధించిన రైతులు ఆయన మాటకు కట్టుబడి సాగును నిలుపుదల చేశారు. అయితే ఆయన ఇచ్చిన హామీ ప్రకారం ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు అందించాల్సివుంది. అయితే ఇప్పటికీ తాళ్లూరు వద్ద పైపులైన్ మరమ్మతు పనులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. మరమ్మతు పనులు ప్రారంభిస్తే ఆ పనులు పూర్తికావడానికి కనీసం 4 నెలల సమయం పడుతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా. ఈ ఏడాది ఖరీఫ్‌కు పుష్కర నీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయంగా నీటిని విడుదల చేసే పరిస్థితి కన్పించకపోవడంతో ఈ ఖరీఫ్‌లోనూ రైతుల పొలాలు బీడులుగా మారక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కొన్ని గ్రామాల్లో తమ పంట పొలాల్లో దుక్కులు దున్నారు. వర్షాధారంతోనైనా పంటలను సాగు చేసుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు.

పుష్కర నీరే ఆధారం

పుష్కర నీరు తమ పంటలకు ఆధారం. ఆ నీరు రాకపోతే వర్షాలు, చెరువులపైనే ఆధారపడాలి. గత ఏడాది అలానే వర్షాధారంతోనే పంటలు పండించాం. పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు సిద్ధం చేశాం.

-బొడ్డు వెంకటరమణ, రైతు, రాజపూడి, జగ్గంపేట

చెరువుల్లో నీరు లేదు

చెరువుల్లో నీరు ఉంటే ఆ నీటి ఆధారంగా ఖరీఫ్ సాగు చేసేవాళ్లం. ప్రస్తుతం చెరువులో నీరు లేదు. రుతుపవనాలు వచ్చాయన్నారు. కానీ వర్షాలు అధికంగా కురవలేదు. ఈ నెలలో వర్షం ఎక్కువగా కురిస్తే ఆకు పోసి పంటలు సాగు చేస్తాం. లేకుంటే బీడు భూములుగా వదిలేయాల్సిందే.

రామిశెట్టి సుబ్బారావు, రైతు రాజపూడి, జగ్గంపేట

నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం

తాళ్లూరు పంపు హౌస్ వద్ద నుంచి 3.5 కిలోమీటర్ల పైపు లైన్లు మార్చేందుకు రూ.52 కోట్లు అవసరం. అందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. నిధులు విడుదల అయితే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. పనులు ప్రారంభించాక నాలుగు నెలలు సమయం పడుతుంది.

- ఎస్‌వి.రమణమూర్తి, పుష్కర ఎఇ, జగ్గంపేట.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

ప్రజాశక్తి - కాకినాడ

కూటమి ప్రభుత్వ పాలన అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సాగుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం నాటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతుందని, ఈ ఏడాది పాలనలో రూ.3 వేలు ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచామని, రోడ్ల గుంతలను పూడ్చి ప్రజారవాణాను మెరుగుపర్చినట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు డిఎస్‌సి ద్వారా 16,034 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించామని, ప్రతినెలా ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు, రాజధాని, పోలవరం పనులు పున్న ప్రారంభం, అన్న క్యాంటీన్లను తెరిచి పేదవాడి ఆకలి నింపడం, రైతు పండించిన ధాన్యం కొని తక్షణమే నగదు చెల్లించామని చెప్పారు. ఈ ఏడాది పాలనలో ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన వైసిపి పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. మద్యం నిషేధం హామీ ఇచ్చి మద్యం ద్వారా రూ.3500 కోట్లు అక్రమ సంపాదకు వైసిపి నాయకులు పాల్పడ్డారని దుయ్యబట్టారు. జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల లక్షల కోట్ల రూపాయలు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కోర్పు సాయితేజ, పెంకే శ్రీనివాస్‌బాబా, నురుకుర్తి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేసిన చంద్రబాబు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గ్రామంలో పర్యటిస్తున్న ముద్రగడ గిరిబాబు

ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారని నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని గజ్జనపూడి గ్రామంలో ఆయన పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బర్ల శ్రీనుచక్రంను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా ప్రచారానికే సరిపోయిందని విమర్శించారు. ఎండియు వాహనాలను రద్దు చేయడం దారుణమన్నారు. వైసిపి పాలనలో అమలు చేసిన పథకాలను రద్దు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోనగాలా అప్పలరాజు, రామిశెట్టి నాని, గారా రమణ, బర్ల నాగరాజు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

సామర్లకోటలో కళ్లకు గంతలతో కార్మికుల నిరసన

తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా జరిగుతున్న సమ్మె శిబిరంలో కార్మికులు రోజుకో రూపంలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిలోభాగంగా కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ సమ్మె జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కొండవీటి రామరాజు, ఉపాధ్యక్షులు కృష్ణ, నాయకులు మేడిపోయిన రమణ, రత్నరాజు, రమేష్, కురుకూరి మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.అలాగే పెద్దాపురం మున్సిపాలిటీ వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 28వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు బాసిన భద్ర రావు, కె.వెంకటరమణ, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, ప్రశాంత్, ఎన్.సూర్యప్రకాష్, మహపాతిన పాపారావు, ఎస్‌కె.బషీర్, తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చెత్త, చెదారం, చెట్లతో మూసుకుపోయిన ప్రధాన డ్రెయినేజీ

నగర పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. 20 వార్డులు ఉన్న ఏలేశ్వరం పేరుకే నగర పంచాయతీ. నగర పంచాయతీగా గుర్తింపు పొందినా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఇళ్లలోంచి వచ్చే వ్యర్థ నీరు పోయేందుకు ఉన్న మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. ప్రతి వార్డులోనూ మురుగు కాలువలు పూడికతో మూసిపోవడంతో మురుగునీరు ముందుకు పోయే పరిస్థితి కన్పించడం లేదు. కాలువల్లో పూడికను తొలగించకపోవడంతో పందులు దొర్లడంతో మురుగు కుంటలుగా మారిపోతున్నాయి. దీంతో దోమలు, ఈగలు పెరిగిపోయి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంచాయతీలోని 20 వార్డులో ఎక్కడ చూసినా మురుగు కాలువలు ఇలానే దర్శనమిస్తున్నాయి. వర్షం వస్తే చాలు మురికి నీరు రోడ్లపై పొంగిపొర్లుతుంది. ముఖ్యంగా చైతన్య నగర్, దిబ్బలపాలెం, మందులు కాలనీ, లింగవరం కాలనీ, వెంగళరావు కాలనీలను మురుగునీరు కమ్మేస్తుంది. మురుగునీరు రోడ్లపైకి రావడంతో ఆయా ప్రాంతాలు దుర్వాసనతో కంపుకడుతున్నాయి. పంచాయతీ అధికారులకు ఎన్ని దఫాలు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో రోజు వారీ చేసే పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే అన్నట్లుగా పరిస్థితి నెలకుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన కోసం కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్య సాధన కోసం అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డిఒ కె.శ్రీరమణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల అభివృద్ధి ద్వారానే విజన్ - 2047 సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీసు రంగాలు బలోపేతం కావాలన్నారు. అన్ని రంగాల్లో ప్రతి ఏడాది 15 శాతం వృద్ధి సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఒ త్సలికి దొరబాబు, సామర్లకోట ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి, డిఒఎస్‌ఒ వీరబాబు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెఇఇ ఫలితాల్లో ఆగస్త్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కాకినాడ

జస్వంత్ తరుణ్‌తేజ్

జెఇఇ మెయిన్ పరీక్షా ఫలితాల్లో శ్రీ అగస్త్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాలకు చెందిన సిహెచ్. యశ్వంత్ 616 ర్యాంక్, ఎ.తరుణ్‌తేజ్ 3134వ ర్యాంక్ సాధించారు ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో శ్రీ అగస్త్య విద్యార్థులు విజయదుందుబి మోగించారని, సంస్థ స్థాపించిన నాలుగేళ్ల కాలంలోనే కాకినాడలో ఒక నెంబర్ వన్ విద్యాసంస్థగా ఎదిగిందని సంస్థ డైరెక్టర్ డి.నాగేశ్వరరావు(డిఎన్‌ఆర్) తెలిపారు. ఈ స్థాయిలోకి వచ్చిందంటే అందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రోత్సాహమేనని అన్నారు. శ్రీ అగస్త్య ఉత్తమ ఫలితాలకు ఉత్తమమైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడమేనని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా తమ విద్యా బోధన ఉంటుందన్నారు. రాబోయే నీట్, ఎంసెట్ ఫలితాల్లోనూ శ్రీ అగస్త్య విద్యాసంస్థలు ఉత్తమ ఫలితాలను అందుకోనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జెఇఇ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు.

కొత్త కల్వర్టులు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఇంద్రపాలెం గ్రామంలో కల్వర్టులు పునఃనిర్మాణం చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రవితేజ, సిహెచ్.సాహిత్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సంతకాలను సేకరించి పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కల్వర్టులు అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొందరు వాహన దారులు ప్రమాదాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున గ్రామంలో కల్వర్టులను పునఃనిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు దివాకర్, సహాయ కార్యదర్శి వాసుదేవ్, నాయకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నాయకత్వం, సాధికారితపై అవగాహన

ప్రజాశక్తి - పిఠాపురం, కోటనందూరు

కోటనందూరులో మాట్లాడుతున్న సిడిపిఒ శ్రీలత

కిశోర బాలికలకు 'నాయకత్వం-సాధికారిత' అంశాలపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం జగ్గయ్యచెరువు వద్ద జరిగిన అవగాహన కార్యక్రమంలో సిడిపిఒ కె.దుర్గాదేవి పాల్గొని మాట్లాడారు. నాయకత్వం అనేది ఒక పదవి కాదన్నారు. ధైర్యంగా, నమ్మకంగా ఉండడానికి మీకు అనుమతి అవసరం లేదన్నారు. బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి.మణి, సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. కోటనందూరు మండలంలోని అల్లిపూడి, కోటనందూరు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సిడిపిఒ శ్రీలత పాల్గొని మాట్లాడారు. కిశోర బాలికలు మరియు కౌమార బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను, బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలల రక్షణ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఎ.వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కరప

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాజు

వైద్య ఆరోగ్య సిబ్బంది డయేరియాపై అప్రమత్తంగా వ్యవహరించాలని డిఐఒ సుబ్బరాజు సూచించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిని డిపిహెచ్‌ఎన్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఆశ డే సందర్భంగా ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు ప్రభావంతో ఈగలు, దోమలు తినే ఆహార పదార్థాలపై వాలకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నిల్వ ఉన్న పదార్థాలను భుజించకూడదని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం జీవన జ్యోతి బీమా యోజన ప్రతి ఒక్కరూ పొంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం వల్ల అనేక అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఏంజెలినా, డాక్టర్ అప్రోజ్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం ఉత్సాహ పూరిత వాతావరణంలో కొనసాగుతుంది. ఉదయం విద్యార్థులకు తెప్పల యోగేష్ కరాటేలో, లోకేష్ వ్యాయామంలో శిక్షణ ఇచ్చారు. హై స్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్, ఎలిమెంటరీ విద్యార్థులకు ఉపాధ్యాయిని బేబీరత్నం కథలు చదవటం, కథలు చెప్పటం, పద్యాలు పాడటంలో శిక్షణ ఇచ్చారు. ప్రజా నాట్య మండలి సీనియర్ కళాకారుడు దారపురెడ్డి కృష్ణ బాలలకు దేశభక్తి, పర్యావరణ పరిరక్షణ పాటలలో శిక్షణ ఇచ్చి అనంతరం వారితో పాటలు పాడించారు. కోలాటంలో అంజలి, అనూష, జశ్వితా శిక్షణ ఇవ్వగా అమృత, నమ్రత, సందీప్, లోకేష్ నృత్యంలో శిక్షణ ఇచ్చారు. కర్ర సాము విన్యాసాలలో నీలపాల కృష్ణ శిక్షణ ఇచ్చి బాలలతో కర్ర సాము చేయించారు.

కార్టూ'నిజం'



రేషన్ కోసం ఆరున్నర కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ చౌక ధరల దుకాణం నుంచి బియ్యం తెచ్చుకోవాలంటే ఆరున్నర కిలోమీటర్లు వెళ్లితీరాల్సిందే. ఇదేంటి అనుకుంటున్నారా? అవును సామర్లకోట శివారు కోదండరామపురం కాలనీకి చెందిన లబ్ధిదారులు ఆరున్నర కిలోమీటర్లు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నారు. ఎండియు వాహనాలను రద్దు చేసి పాత పద్ధతిలో కూటమి ప్రభుత్వం చౌక ధరల దుకాణాలను జూన్ ఒకటో తేదీన ఎంతో ఆర్భాటంగా ప్రారంభించింది. స్థానిక మున్సిపాలిటీలో 5వ వార్డుకు చెందిన కోదండరామపురం శివారు ప్రాంతం సామర్లకోట- పిఠాపురం రోడ్‌లోని జల్లూరు గ్రామం సమీపంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో సుమారు 100 కుటుంబాలు పైగా నివసిస్తున్నాయి. ఇప్పటివరకు ప్రతి నెల ఎండియు వాహనం ద్వారా రేషన్ సరుకులు ఈ ప్రాంత ప్రజలు అందుకునేవారు. ఆ సమయంలో ఇంటింటికీ కాకపోయినా ఒక్కో వీధి శివారును బియ్యాన్ని అందించే పరిస్థితి ఉండేది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆ ప్రాంత లబ్ధిదారులు పట్టణంలోని కుమ్మరి వీధిలోనున్న రేషన్ షాప్ నెంబర్ 3కి వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ రేషన్ డిపోకు ఈ లబ్ధిదారులు ఉండే ప్రాంతానికి సుమారు ఆరున్నర కిలోమీటర్ల పైబడి దూరం ఉంది. రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీ ప్రారంభించి మంగళవారం నాటికి మూడు రోజులు కావస్తున్నా కోదండరామపురం నుంచి కనీసం 10 మంది కూడా నిత్యవసర సరుకులను తెచ్చుకున్న పరిస్థితి లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిఎస్‌ఒ దృష్టికి తీసుకెళ్తా: ఎంఎస్‌ఒ

కోదండరామపురం ప్రాంత ప్రజల సమస్యను డిఎస్‌ఒ దృష్టికి తీసుకెళ్తానని ఎంఎస్‌ఒ కమల్‌కుమారి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంఎస్‌ఒ తెలిపారు.

కష్టతరంగా ఉంది

అంత దూరం ప్రయాణం చేసి నెలనెలా రేషన్ సరుకుల కోసం వెళ్లలేం. రేషన్ సరుకులు నెల నెల కోదండరాంపురంలో అందించేలా చర్యలు తీసుకోవాలి. అంతదూరం వెళ్లాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తుంది.

-సన్నపు కుమారి , లబ్ధిదారు

పాత పద్ధతే మేలు

పాత పద్ధతి తమకు ఎంతో మేలు. ఎండియు వాహనాల్లో తమ ప్రాంతానికే వచ్చి సరుకులు అందించేవారు. పాత పద్ధతిలోనే తమకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-ముమ్మితి లోవ కుమారి, లబ్ధిదారు

జల్లూరులో ఇప్పించాలి

కోదండరామపురం ప్రాంతం జల్లూరు గ్రామానికి దగ్గరలో ఉందని, కావున జల్లూరు రేషన్ దుకాణం ద్వారా సరుకులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా తమ కష్టాలు తీరుతాయి.

-ముమ్మితి రాము, లబ్ధిదారు

నేరాలు ఘోరాలు

ప్రమాదానికి గురైన లారీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

కాపవరం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం పాలయ్యారు. మంగళవారం తెల్లవారు జామున హైదరాబాద్ నుంచి మండపేటకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఇతర లారీలు తన లారీని ఢీకొడతారని భావించిన లారీ డ్రైవర్ బత్తుల శీనయ్య అప్రమత్తపై లారీ వెనుక నిలబడి అమార్గంలో వస్తున్న వాహనాలకు డైరెక్షన్ ఇస్తున్నారు. అదే సమయంలో జంగారెడ్డిగూడెం నుంచి ధాన్యంలోడుతో వస్తున్న మరో ఐసర్ వ్యాను శీనయ్యను ఢీ కొట్టి ఆగి ఉన్న లారీలు ఢీ కొట్టింది. ఈ ఘటనలో శీనయ్యతో పాటూ కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన ఐసర్ వ్యాన్ డ్రైవర్ కొయ్య బాబూరావు(40) మృతి చెందారు. కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శీనయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని నవఖండ్రవాడ గ్రామంలో నకులమ్మ గుడి వీధిలోని ఒక ఇంట్లో దాచివుంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని చక్రవర్తుల నాగమణి ఇంట్లో రేషన్ బియ్యం దాచి వుంచినట్లు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌ఛార్జ్ ఎంఎస్ఓ భారతి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది దాడి చేశారు. ఒక గదిలో మూడు సంచుల్లో సుమారు వంద కిలోల బియ్యాన్ని అధికారులు గుర్తించారు. వాటిని సీజ్ చేసి సమీప రేషన్ దుకాణానికి తరలించారు. బియ్యంను దాచిపెట్టిన నాగమణిపై క్రిమినల్ కేసుతోపాటు, 6ఎ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ తెలిపారు. ఇదిలావుండగా అధికారులు వచ్చేలోగా ఒక ఆటోలో రేషన్ బియ్యం తరలి పోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ దాడుల్లో విఆర్ఓ పి.రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

తుని - నర్సీపట్నం ప్రధాన రహదారిలోని ఉప్పరగూడెం వద్ద ట్రాక్టర్, బైకు ఢీకొన్న సంఘటనలో గేదెల రాజునాయుడు (37) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... తుని మండలం కుమర్లలోవ గ్రామానికి బైక్‌పై గేదెల రాజునాయుడు తన కుమారులు మణికంఠ, శ్రీనివాస్‌లతో వెళ్తుండగా ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజునాయుడు అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌పై ఉన్న అతని ఇద్దరు కుమారులు గాయాలతో బయటపడ్డారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తాడిపూడి ఓపెన్ ర్యాంపు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని మంగళవారం సీజ్ చేశామని ఇన్‌ఛార్జి తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆర్‌డిఓ ఆదేశాల మేరకు ర్యాంపు నిర్వహిస్తున్న ఏజెన్సీకి నోటీసులు జారీ చేశామన్నారు. జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు ఓపెన్ ఇసుక ర్యాంపుల్లో ఎటువంటి ఇసుక లావాదేవీలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓపెన్ ఇసుక ర్యాంపులుగా ఉన్న తాడిపూడి-1, వేగేశ్వరపురం-1 ర్యాంపులను ఇద్దరు విఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, టాస్క్ ఫోర్స్ అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని కరగపాడు, బుచ్చియ్యపాలెం గ్రామాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి సారా తయారు చేస్తున్న, సారాను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కరగపాడులో సారా తయారు చేస్తున్న బుర్రి వెంకటరమణను అరెస్టు చేసి, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. బుచియ్యపాలెంలో సారా అమ్మకాలు జరుపుతున్న చిక్కాల రామకృష్ణను అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులపాక, గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ఆలమూరు

అగ్నిప్రమాదంలో పశువులపాక, గడ్డివామి దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలోని పెనికేరు పోలాల్లో చోటుచేసుకుంది. గోపు శ్రీనువాస్ అనే రైతుకు చెందిన పశువులపాకతో పాటుగా తన పశువుల గ్రాసంగా వేసిన భారీ గడ్డివామి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. అయితే ప్రమాద సమయంలో పాకలో ఐదు గేదెలు ఉండగా మూడు గేదెలు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డాయి. అయితే రెండు గేదెలకు మాత్రం మంటలనుంచి తప్పించుకోలేక తీవ్ర గాయాల పాలయ్యాయని రైతు ఆవేదన చెందారు. గాయపడిన గేదెలకు పెనికేరు పశు వైద్యులు భానుప్రసాద్ వైద్య సేవలు అందించారు. సుమారు రూ.లక్ష పైన ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

నగర అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ వనమాడి కొండబాబు

నగర అభివృద్ధి కోసం విజన్ - 2029 యాక్షన్ ప్లాన్‌తో కృషి చేయాలని ఎంఎల్ఎ వనమాడి కొండబాబు సూచించారు. మంగళవారం ఎంఎల్ఎ కార్యాలయంలో నగర పాలక సంస్థ అధికారులతో నగర అభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా కాకినాడ నగర అభివృద్ధికై విజన్ యాక్షన్ ప్లాన్ 2029 రూపొందించడం జరిగిందని తెలిపారు. జిల్లా వృద్ధి రేటు15 శాతానికి పెంచేందుకు అధికారులు కృషి చేయడం జరుగుతుందని, పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత వంటి విధానాలతో తాజా విజన్ రూపొందించడం జరిగిందని, 2029 నాటికి కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసి అందుకు అనుగుణంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సుధాకర్, ఎస్ఇ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, సివిఎపి టీమ్ సుష్మ, సూర్య కుమారి, సాయిపూజ, దేవిక, శాలిన పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

బాధితులకు చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప బాధితులకు అందజేశారు. మంగళవారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రొంగల ఆనంద్‌కు రూ.67,038, బొగ్గు వీరబాబుకు రూ.81,965 చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. టిడిపి యాప్ ద్వారా సోషల్ మీడియాలో 2 లక్షల పోస్టింగులు చేసిన ఐటిడిపి పెద్దాపురం అధ్యక్షులు రేలంగి వెంకటరావుకు సైకిల్ మెమెంటును ఎంఎల్ఎ చినరాజప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రంది సత్యనారాయణ, మహమ్మద్ ఆరిఫ్ ఆలీ, నూనె రామారావు, తోట రామకృష్ణ, మొయిళ్ళ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సొంత వారి కోసమే రేషన్ దుకాణాలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



మీడియాతో మాట్లాడుతున్న నాగమణి

సొంత వారి కోసమే కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణలను తెరిచిందని సివిల్ సప్లయి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లబ్ధిదారుల ఇంటికే సరుకులను అందించాలనే లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి ఎండియు వాహనాలను తెరపైకి తెచ్చారని అన్నారు. తద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎండియు ఆపరేటర్ల పొట్టను కొట్టి తమ పార్టీ కార్యకర్తల పొట్టలను నింపేందుకే ఎండియు వాహనాలను రద్దు చేశారని అన్నారు. రాజకీయ కక్షతో ఎండియు వాహనాలను రద్దు చేయడం తగదని ఆమె హితవు పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఎస్-ఎస్ స్కీంలో 24 గంటల విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే పనులు జరగనున్నాయని, కావున చేబ్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని తాటిపర్తి, చిన్న జగ్గంపేట గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ఇటీవల విడుదలైన సిబిఎస్ఇ 10వ తరగతి పరీక్షల్లో నగరంలోని పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో విజయ కేతనం ఎగరవేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం కలెక్టరేట్‌లో కేంద్రీయ విద్యాలయం ఛైర్మన్, కలెక్టర్ షాన్ మోహన్ సగిలిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.శేఖర్ విద్యార్థులు సాధించిన ప్రగతిని కలెక్టర్‌కు వివరించారు. తెలియజేశారు. పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణతతో మంచి మార్కులు సాధించిన దేవ్‌హాసన్, స్నేహ శరణ్య, కె.భాను సూర్యశ్రీ, జి.హాసిని, వారి తల్లిదండ్రులనను, ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోను కొనసాగించి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

మల్లాడి పుట్టినరోజు సందర్భంగా మహిళలు, పురుషులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకుని బుధవారం మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మల్లాడి అభిమాన సంఘ నాయకులు తెలిపారు. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉదయం 8 గంటలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం 5 గంటలకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పురుషులకు 5వ తేదీన ఉదయం 7 గంటలకు 4కె రన్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 5 వేలు, రెండవ బహుమతిగా రూ. 4వేలు, మూడవ బహుమతిగా రూ. 3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు 6వ తేదీన మల్లాడి పుట్టినరోజు వేడుకలు నిర్వహించే వేదిక వద్ద ఆయన చేతుల మీదుగా అందజేస్తామన్నారు.

చెట్టు విరిగి విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు సబ్ స్టేషన్ సమీపంలో చెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో అంబేద్కర్ నగర్, రామన్నకోడు, జిఎన్.నాయుడు కాలనీ, రమాబాయి నగర్, ఆది ఆంధ్ర పేట, గణపతి నగర్ తదితర ప్రాంతాలు విద్యుత్ సరఫరాకు మంగళవారం సాయంత్రం అంతరాయం కల్గింది. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన విరిగిన చెట్టును తొలగించి విద్యుత్‌ను పున్నరుద్ధరించారు.

వెన్నుపోటుకు నిదర్శనం జగన్

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేటలో మీడియాతో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: వెన్నుపోటుకు నిదర్శనం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలను, కుటుంబ సభ్యులను వెన్నుపోటు పొడిచి, చంద్రబాబును వెన్నుపోటు దారుడు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో 70 శాతం హామీలను అమలు చేస్తే గత జగన్ సంవత్సర పాలనలో 10 శాతం హామీలను అమలు చేశారని ఆరోపించారు. మద్యపాన నిషేధం చేస్తామని జగన్ హామీ ఇచ్చి కల్తీ మద్యంతో ప్రజలను వెన్నుపోటు పొడిచా రన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమానంగా అమలు చేస్తున్న చంద్రబాబును వెన్నుపోటు దారుడు అని ఎలా అంటారని నెహ్రూ ప్రశ్నించారు. ఏడాదిగా చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి జగన్‌కు కనిపించడం లేదా లేక ఇప్పుడే లేచరా అంటూ హేళన చేశారు. తాను చేసిన ఆరోపణలను నిజం కాదని నిరూపించేందుకు చర్చకు సిద్ధమా అంటూ జ్యోతుల సవాల్ విసిరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్ .అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణి బాబు, పైడిపాల సూరిబాబు, ముండ్రు ఎర్రబాబు, బద్ది సురేష్, నల్ల చిరంజీవి పాల్గొన్నారు. **పిఠాపురం:** జగన్ నోట వెన్నుపోటు రావడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు వెన్నుపోటు పొడవడమే కాదు తన కుటుంబానికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్ అని ఎద్దేవా చేశారు. మద్యం తదితర కేసుల్లో వైసిపి నేతలు వరుసగా జైలుకు వెళ్లడంతో జగన్‌కు వెన్నులో వణుకు పుడుతోందని అన్నారు. ఓటమి తర్వాత తన అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకు జగన్ వెన్నుపోటు అంటూ ప్రజల ముందుకు వస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గున్నారు. **పెద్దాపురం:** జగన్ ప్రభుత్వ పాలనలో జరిగిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసిపి వెన్నుపోటు డ్రామా ఆడుతుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజా ప్రయోజనాలను విస్మరించి సొంత ప్రయోజనాల కోసమే పాలన సాగించారన్నారు. జగన్ పాలనలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో అనేక మంది జైలు బాట పడుతున్నారని, కొత్తగా మద్యం కుంభకోణం బయటికి వచ్చిందన్నారు. కుంభకోణాలకు భయపడే జగన్ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఇప్పటికే అనేక పథకాలు అమలు జరిగాయన్నారు. అభివద్ధి, సంక్షేమం కలిసికట్టుగా అమలు జరుగుతున్నాయన్నారు. జగన్ పాలనలో రహదారులను విస్మరిస్తే తమ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే 26 వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలు, ప్యాచ్ వర్కును పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, రంది సత్యనారాయణ, తూతిక రాజు, మొయిళ్ళ కృష్ణమూర్తి, తోట రామకృష్ణ, నూనె రామారావు, మహమ్మద్ ఆరిఫ్ ఆలీ, రేలంగి వెంకటరావు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్:** వెన్నుపోటు, గొడ్డలివేటుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్మోహన్ రెడ్డి వెన్నుపోటు దినం కార్యక్రమాలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి అన్నారు. మంగళవారం వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ రెడ్డి తన ఉనికిని చాటుకునేందుకే ధర్నాలకు దిగుతున్నారని విమర్శించారు. మద్యపాన నిషేధం, మెగా డిఎస్‌సిపై మాట తప్పిన జగన్ వెన్నుపోటు కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు జగన్ చేసిన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ధర్నాల డ్రామా అడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కాళ్ళ శ్రీనివాస్, పంపన బుజ్జి, దాసరి సత్తిబాబు పాల్గొన్నారు.

రంగుమారిన ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

ధాన్యం రాశులను ఆరబెడుతున్న రైతులు

వర్షాల కారణంగా రంగు మారిన ధాన్యం పరిస్థితిపై మార్కెటింగ్ శాఖ సాంకేతిక నిపుణులు మంగళవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో పంట పొలాల్లో ధాన్యపు రాశులు తడిసి పోవడంతో ధాన్యం రంగు మారింది. దీంతో సామర్లకోటలో భీమవరం ప్రాంత రైతులు తమ పరిస్థితిని జాయింట్ కలెక్టర్‌కు వివరించడంతో మార్కెటింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్లు ధాన్యాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ధాన్యానికి మద్దతు ధరను అందించాలని రైతులు కోరారు. ప్రస్తుతం రైతుల నుంచి ధాన్యం శాంపిల్స్ సేకరించి, వాటి పరిస్థితిని జిల్లా అధికారులకు నివేదించడం జరుగుతుందని, కలెక్టర్ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు నిర్వహిస్తారని వ్యవసాయ అధికారి సత్య తెలిపారు. ఈ పరిశీలనలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ సహాయ అధికారులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న దళారులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ధర్నా చేస్తున్న రైతు-కూలీలు

రైస్ మిల్లర్స్ మధ్య దళారులతో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని గోరింట గ్రామంలో రైతుల సమస్యలపై ధర్నా జరిగింది. ఈ సందర్భ:గా ఆయన మాట్లాడుతూ దళారులు రైతులకు రైస్ మిల్లర్లు ద్వారా వ్యవసాయ పెట్టుబడికి అప్పులు ఇప్పించి పంట పండిన తర్వాత వారు చెప్పిన ధరకే ధాన్యం కొంటున్నారన్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. సన్న, చిన్న కారు రైతులందరికీ సహకార బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి సురేష్, కర్రి తమ్మారావు, మాదిరెడ్డి తాతయ్య, కర్రి శ్రీను, మిరియాల రామకృష్ణ, రాంబాబు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

గణితంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం గణితంలో చతుర్విధ ప్రక్రియలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణితంలో ప్రాథమిక అవగాహన పెంపొందించుకుంటే గణితం పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు చదవటం, కథలు చదవటం, కథలు చెప్పటం, పాటలు పాడటం, పద్యాలు ఆలపించటం లో శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో పాటలు, పద్యాలు పాడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్ద కానరాని బోర్డులు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణాల వద్ద సరుకుల బోర్డులు ఎక్కడా కానరావడం లేదు. రాజపూడి 35 వ నెంబర్ రేషన్ షాపు ను మండల పరిషత్ ఆదర్శ పాఠశాల పక్కనే ఒక ఇంట్లో ఏర్పాటు చేశారు. ఐతే ఆ దుకాణం బయట సరుకుల పట్టిక పెట్టాల్సి ఉంది. కానీ ఆ డీలర్ బోర్డు ఏర్పాటు చేయకుండానే రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఇదిలావుంటే రేషన్ సరుకులు కోసం వృద్ధులు వచ్చి అగచాట్లు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వాహనాలను రద్దు చేసి వద్ధులకు, వికలాంగులకు ఇంటికి అందించే విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఐతే ఆ విషయం తెలియని వృద్ధులు దుకాణాల వద్దకు వచ్చి వెనుతిరుగుతున్నారు. వృద్ధులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రచారం చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పేపరు ప్రకటన

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు

I.A. No. 553 of 2019 in

O.S. No. 209 of 2019

Between:

చింతా బాపిరెడ్డి -పిటిషనర్

AND

1. తుమ్మపూడి మల్లేశ్వరి
2. ఒజ్జి లక్ష్మికుమారి -రెస్పాండెంట్లు

To:

1వ రెస్పాండెంటు: తుమ్మపూడి మల్లేశ్వరి,

R-1: తుమ్మపూడి మల్లేశ్వరి

R-1: తుమ్మపూడి మల్లేశ్వరి, W/o. సాంబశివరావు, D/o. రాజమండ్రి వీరాస్వామి, వయస్సు 56 సం॥లు, హిందువు, అటెండర్ in A/O ఆఫీస్, A.P.S.P.D.C.L. Ltd., చిట్టినగర్ సెక్షన్, 1-టౌన్, డో.నెం. 5-6-59/106/బి. రైతు బజార్ ఎదురుగా, రాజేష్‌రావు వీధి, ఫ్రేజర్ పేట, విజయవాడ - 520001, కృష్ణా జిల్లా, నివాసం: డో.నెం. 1-184, ఉండవల్లి, తాడేపల్లిగూడెం మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు పిటిషన్ ది. 16-06-2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా అయివున్నది. పై పిటిషన్ నందు మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది. 16-06-2025వ తేదీన ఉదయం 10.30 గంటల** నుండి మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి మీ వాదనను తెలుపుకొనవలెను. లేని యెడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పు చెబుదురు.

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

పెద్దాపురం
ది.02-05-2025

M.K.మొహియుద్దీన్
అడ్వకేట్, పెద్దాపురం

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికడదాం...

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని అరికడ్డటానికి యువత ముందుకు రావాలని రిటైర్డు ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎన్.అబ్బులు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో ని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియం హాలు నందు మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (కాకినాడ), పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు వ్యాచరచన, డ్రాయింగ్ తదితర పోటీ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం భవిష్యత్ తరాలకు పెను ప్రమాద కరంగా మారనుందని, ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కన్నిడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం ప్లాస్టిక్ నియంత్రణ పోస్టర్స్ ఆవిష్కరించారు. కార్యక్ర మంలో విద్యార్థులు, సంస్థ సభ్యులతో పాటు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ప్రసాద్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి రూ.4లక్షల సాయం

ప్రజాశక్తి -ఐ.పోలవరం

కె.గంగవరం మండలం శేరుల్లంక గ్రామ సమీపంలో ఇటీవల గోదావరి నదిలో స్నానానికి దిగి 8 మంది పిల్లలు మృతి చెందారు. ఈ ఘటనలో జి.మూలపొలం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న యర్రగరువు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందారు. వారి తండ్రి వడ్డి భైరవస్వామికు ప్రభుత్వ ప్రకటించిన ఒక్కొక్కరికి రూ.2లక్షల పరిహారాన్ని స్థానిక ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు రూ.4 లక్షలు విలువగల చెక్కును మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరం వారికి మనో ధైర్యం కలిగించారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, కాకర్లపూడి రాజేష్, మందపాటి భైరవ స్వామి,కాగిత బాలయోగి, మెల్లం సింహాచలం, సత్యనారాయణ, గంగాధరం పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

చిన్నారులకు నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహార పదార్థాలను అందించే విధంగా మధ్యాహ్న బోజన పథక సహాయకులు కషి చేయాలని మధ్యాహ్న బోజన పథకం ఎడి ఎన్.సురేష్ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల విద్యా శాఖ అధికారులు గౌరీ శంకర్, ఉదయ భాస్కర్ ల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న 80 పాఠశాలల కుక్ కమ్ హెల్పర్స్ కు మంగళవారం బోజన తయారీ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎడి సురేష్ మాట్లాడారు. అనంతరం శిక్షకులుగా వచ్చిన పీవీ గోపాల్, సాధనాల సూర్యవతిలు కుక్ కమ్ హెల్ప్‌ర్స్‌కు వంట తయారీ విధానంలో పాటించాల్సిన విధానాలపై శిక్షణ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం సహాయకులు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు సన్న బియ్యం పంపిణీ చేస్తారని కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారని ఎంఇఓ కె.తాతారావు నిర్వాహలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన కపిలేశ్వరపురం జడ్‌పి ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు పాఠశాలల్లో భోజనం అందిస్తున్న కుక్ కమ్ హెల్పర్ లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడారు.. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం, మండల సిబ్బంది, పాఠశాలల నుంచి వచ్చిన ఎండిఎంలు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S.226/2024

Between:
Gubbala Naga Malleswara Rao ...Plaintiff

And:
Smt. Nanduri Kiranmai ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Smt. Nanduri Kiranmai,
D/o.Veerabhadrasarma,
D.No.11-3-8,
Sheshayyampeta, Aryapuram,
Rajahmahendravaram,
East Godavari,
Andhra Pradesh-533104.

Please take notice that the above suit was filed by the Plaintiff against you for recovery of money with costs and for such other relief/reliefs and the same was stands posted to serve notice to you for your appearance on **20-06-2025.** As such you are get ready to appear either in person or through an Advocate on **20-06-2025** at **10.30 A.M.,** before Court at Visakhapatnam, failing which you will be set ex-parte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
G. ESWARA PRASAD,
Advocate
Visakhapapatnam-08.
Cell: 9849793466.

పేపరు ప్రకటన

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు

O.S. No. 209 of 2019

Between:

చింతా బాపిరెడ్డి -వాది

AND

1. తుమ్మపూడి మల్లేశ్వరి
2. ఒజ్జి లక్ష్మికుమారి -ప్రతివాదులు

To:

1వ ప్రతివాది: తుమ్మపూడి మల్లేశ్వరి,

D-1: తుమ్మపూడి మల్లేశ్వరి, W/o. సాంబశివరావు, D/o. రాజమండ్రి వీరాస్వామి, వయస్సు 56 సం॥లు, హిందువు, అటెండర్ in A/O ఆఫీస్, A.P.S.P.D.C.L. Ltd., చిట్టినగర్ సెక్షన్, 1-టౌన్, డో.నెం. 5-6-59/106/బి. రైతు బజార్ ఎదురుగా, రాజేష్‌రావు వీధి, ఫ్రేజర్ పేట, విజయవాడ - 520001, కృష్ణా జిల్లా, నివాసం: డో.నెం. 1-184, ఉండవల్లి, తాడేపల్లిగూడెం మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు దావా ది. 16-06-2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా అయివున్నది. పై దావా నందు మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది. 16-06-2025వ తేదీన ఉదయం 10.30 గంటల** నుండి మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి మీ వాదనను తెలుపుకొనవలెను. లేని యెడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పు చెబుదురు.

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

పెద్దాపురం
ది.02-05-2025

M.K.మొహియుద్దీన్
అడ్వకేట్, పెద్దాపురం